సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం ၊ 6 ၊ డిసెంబర్ ၊ 2023



అంజన్నను దర్శించుకున్న భక్తులు


జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



ఆక్వా రైతుల్లో గుబులు

తుపాను ఆక్వా రైతుల్లో గుబులు రేపుతోంది. వాతావరణం పూర్తిగా చల్లబడి, ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ఆక్సిజన్ సమస్య తలెత్తింది. –8లో

ప్రత్యేక అలంకరణ



పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు.

ముంచెత్తిన మిచాంగ్

- పశ్చిమ గోదావరిలో స్తంభించిన జనజీవనం
- భారీ వర్షాలతో నీటమునిగిన పల్లపు ప్రాంతాలు
- మంగళవారం సాయంత్రానికి 168.6 మి.మీ వర్షపాతం
- 12వేల ఎకరాల్లో నేలకొరిగిన వరిపంట
- సహాయక చర్యల్లో నిమగ్నమైన అధికార యంత్రాంగం
- జిల్లా వ్యాప్తంగా 24 పునరావాస కేంద్రాలు

సాక్షి, భీమవరం: మిచాంగ్ తుపాను జిల్లాను ముంచెత్తింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపిలేకుండా కుండపోతగా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు, డ్రెన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. 17 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. తుపాను ప్రభావంతో ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా జిల్లాలోని అధికారయంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమైంది.

మంగళవారం మధ్యాహ్న సమయంలో మిచాంగ్ బాపట్ల సమీపంలో తీరం దాటగా తెల్లవారుజాము నుంచి జిల్లా అంతటా ఈదురుగాలులతో భారీ వర్షాలు కురిశాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం సాయంత్రానికి జిల్లాలో సగటు వర్షపాతం 168.6 మి.మీ వర్షపాతం నమోదవగా ఆకివీడు మండలంలో అత్యధికంగా 275 మి.మీ వర్షపాతం కురవగా, పెనుమంత్ర మండలంలో 104 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలతో జిల్లా కేంద్రమైన భీమవరంతో పాటు తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం తదితర పట్టణాల్లో రోడ్లు జలమయమయ్యాయి. జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయగా 90 వేల ఎకరాల్లో రైతులు వరికోతలు పూర్తి చేశారు. భారీ వర్షాలతో మిగిలిన విస్తీర్ణంలోని ఐదు వేల ఎకరాలు నీట మునగ్గా, 12 వేల ఎకరాల్లోని పంట నేలకొరిగినట్టు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు.

28 పునరావాస కేంద్రాల ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణనష్టం సంభవించకుండా కలెక్టర్ పి.ప్రశాంతి పర్యవేక్షణలో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. తీరప్రాంతంలోని నరసాపురం, మొగల్తూరు మండలాలు, లోతట్టు ప్రాంతమైన భీమవరంలో ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలో తుపాను ప్రభావిత 28 తీరప్రాంత, గోదావరి లంక, లోతట్టు గ్రామాలు, శివారు ప్రాంతాలను గుర్తించి ఎనిమిది వేల మందికి సరిపడా 24 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటిలో మొగల్తూరు మండలంలో ఆరు, నరసాపురం మండలంలో ఐదు, భీమవరం అర్బన్‌లో మూడు, రూరల్‌లో మూడు, కాళ్ల, తాడేపల్లిగూడెం మండలాల్లో రెండు చొప్పున, ఆకివీడు, తణుకు, పెనుమంత్ర మండలాల్లో ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. నరసాపురం మండలంలోని వేములదీవి, పీఎం లంక, చినమేను వాని లంక, మొగల్తూరు మండలంలోని పేరుపాలెం, కేపీ పాలెం, ఏటిమొండి, పల్లవిపాలెం గ్రామాల నుంచి 5,113 మందిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. కేంద్రాల వద్ద ఆహార అవసరాల కోసం 608.56 కిలోల బియ్యం, 1202 కేజీల గోధుమ పిండి, 2640 కిలోల పంచదార అందుబాటులో ఉంచారు. ముందుజాగ్రత్తగా తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని 11 మంది గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించారు. పాడిపశువులు ముంపుబారిన పడకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా మొగల్తూరు, నరసాపురం మండలాల్లో పలు ఎనిమిది ప్రాంతాలను సిద్ధం చేశారు. మండలాల్లో ఫైర్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో సిబ్బందితో కలెక్టర్ ప్రత్యేకంగా రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందాలు ఏర్పాటుచేశారు. ఈదురుగాలుల ప్రభావంతో రోడ్లపై కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు తొలగించి రాకపోకలకు సుగమం చేసేందుకు ఈ బృందాలు శ్రమిస్తున్నాయి. అందుకోసం 22 రంపం యంత్రాలు, 21 జేసీబీలు, విద్యుత్ సమస్యలేకుండా 10 జనరేటర్లను అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యలేమి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వైద్య శిబిరాల నిర్వహణకు కలెక్టర్ అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే వర్షం తగ్గిన వెంటనే డ్రెయిన్లలో పూడిక తొలగించే పంట చేలు ముంపు నుంచి బయటపడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



కాళ్ల: మండలంలో నీట మునిగిన వరి పంట



ఆచంట మండలం వేమవరంలో రైతులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కన్నబాబు, కలెక్టర్, జేసీ



అత్తిలి: మండలంలోని వరిఘేడులో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి కారుమూరి



నరసాపురం రూరల్ : పేరుపాలెం పునరావాస శిబిరంలో భోజనాలు వడ్డిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



పెనుగొండ : ఆచంట మండలంలో వరిపంట పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ రంగనాథరాజు

పంట నష్టం పరిశీలించిన ప్రత్యేకాధికారి

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల పర్యవేక్షణ ప్రత్యేకాధికారి కె కన్నబాబు, కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్ రామసుందర్‌రెడ్డిలు పర్యటించారు. ఆచంట మండలం వేమవరంలోని నేలకొరిగిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అధైర్యపడవద్దని రైతులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని రైతులకు భరోసానిచ్చారు.

సత్వర ఉపశమన చర్యలు

అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం జిల్లాకు విడుదల చేసిన రూ. రెండు కోట్లతో సత్వర ఉపశమన చర్యలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పొలాల్లోని ముంపునీరు పోయేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రతి కుటుంబానికి రూ.2500 చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్టు కలెక్టర్ తెలిపారు.

ధాన్యం అమ్మకాలకు సడలింపులు

జిల్లా ప్రత్యేకాధికారి కే కన్నబాబు

పెనుగొండ: ధాన్యం అమ్మకాల్లో ప్రభుత్వం పలు సడలింపులు జారీ చేసిందని జిల్లా తుపాను ప్రత్యేకాధికారి కే కన్నబాబు తెలిపారు. మంగళవారం ఆచంట మండలం ఆచంట వేమవరంలో నీట మునిగిన వరిచేలను, ధాన్యం రాశులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతితో కలసి పరిశీలించారు. ఆన్‌లైన్‌తో సంబంధం లేకుండా ఆఫ్‌లైన్ ద్వారా రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి సమీపంలో తమకు నచ్చిన రైసుమిల్లులకు పంటను చేర్చుకొనే వెసులుబాటు కల్పించామన్నారు. జీపీఎస్ వాహనాలు లేకపోయినా, అందుబాటులో ఉన్న వాహనాలుగాని, రైతుల సొంత వాహనాలతో గాని రవాణా చేసుకోవచ్చని వివరించారు. తేమ శాతంతో సంబంధం లేకుండా తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లాలో ఒక్కరోజే 46 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు ఆఫ్‌లైన్‌లో తరలించారన్నారు. మిగిలిన ధాన్యాన్ని తరలించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారన్నారు. కలెక్టరు మాట్లాడుతూ పంటల నష్టం అంచనా వేసి, ప్రభుత్వ పరంగా అన్ని రక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



వీరవాసరం: మండలంలో సుడిగాలి ధాటికి తిరగబడ్డ వాహనాలు



నరసాపురం రూరల్: మండలంలో సుడిగాలికి నేలకూలిన వృక్షం



తాడేపల్లిగూడెం రూరల్: ధాన్యంపై బరకాలు కప్పుతున్న రైతు



ఆకివీడు : ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న అధికారులు

ప్రతి రైతుకూ అండగా ఉంటాం

అత్తిలి: ఏ ఒక్క రైతు నష్టపోకుండా ధాన్యం కొనుగోలులో రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం అత్తిలి మండలం వరిఘేడులో కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను మంత్రి కారుమూరి పరిశీలించి, రైతులకు భరోసా కల్పించారు. అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పశుగ్రాసానికి కొరత లేకుండా ప్రణాళిక రూపొందించాలని పశుసంవర్థక శాఖ అధికారులను సీఎం ఆదేశించారని మంత్రి చెప్పారు.

వణికించిన మిచాంగ్

నరసాపురం: మిచాంగ్ తుపాను నరసాపురం తీర గ్రామాలను వణికించింది. నరసాపురం మండలం చినమైనవానిలంక, పెదమైనవాలనిలంక, మొగల్తూరు మండలం పేరుపాలెం, కేపీపాలెం తీర ప్రాంతాల్లో బీచ్‌ల వద్ద సముద్ర అలలు ఎగిసిపడ్డాయి. ఆయా ప్రాంతాల్లో అలలు సుమారు 10 నుంచి 20 మీటర్లు ముందుకు చొచ్చుకువచ్చాయి. నరసాపురం మండలంలో 5, మొగల్తూరు మండలంలో 7 చొప్పున మొత్తం 12 తుఫాన్ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ సంఖ్యను 25కు పెంచారు. ప్రతి పునరావాస కేంద్రానికి అందుబాటులో 14 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రంలో అల్పాహారం, భోజన సదుపాయాలు కల్పించారు. ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేవారు. ఏ పరిస్థితి వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు తుఫాన్ రక్షిత శిబిరాల్లోకి చేరుకోవాలని సూచించారు. శిబిరాలను సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. బాధితులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఆయన వెంట ఆర్డీవో ఎం.అత్యుత్ అంబరీష్, తహసీల్దార్ ఎండీ ఫాజిల్ తదితరులు ఉన్నారు.



పాలకొల్లు అర్బన్ తిల్లపూడిలో సుడిగాలికి విరిగిపడ్డ కొబ్బరి చెట్లు

నీట మునిగిన పల్లపు ప్రాంతాలు



భీమవరం బీసీ కాలనీలో నీటమునిగిన రోడ్డు

భీమవరం(ప్రకాశం చౌక్): తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. దాంతో జనం రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రోజంతా వర్షం కురవడంతో చిరు వ్యాపారుల ఉపాధి దెబ్బతింది. పట్టణాల్లో ఫుట్‌పాత్ వ్యాపారాలు సాగలేదు.

రికార్డు వర్షపాతం : మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జిల్లాలో సగటున 168.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భీమవరంలో 217.2 మి.మీ, పాలకోడేరు 191.4 మి.మీ, వీరవాసరం 181.5, ఉండి 209.2, కాళ్ళ 252, ఆకివీడు 275, ఆచంట 150, నర్సాపురం 126, పాలకొల్లు 266, యలమంచిలి 124.4, తణుకు 112.2, తాడేపల్లిగూడెం 130, గణపవరం 220.2, పెంటపాడు 136.6, అత్తిలి 114, ఇరగవరం 103.2, పెనుమంత్ర 104.8, పోడూరు 111.4, పెనుగొండ 110.6, మొగల్తూరు 227 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. బుధవారం కూడా జిల్లాలో భారీ వర్షాలు ఉంటాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. అత్యవసర సాయం కోసం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 08816 299219 ను ఉపయోగించుకొవాలన్నారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లు, వంతెనలు, తదితర ప్రాంతాల్లో ముందస్తు చర్యలకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



నరసాపురం రూరల్: మండలంలోని లిఖితపూడిలో సుడిగాలి బీభత్సం

న్యూస్‌రీల్

బాధితులను అన్నివిధాలా ఆదుకుంటాం



వీరవాసరంలో బాధితులను పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: తుపాను ప్రభావంతో మంగళవారం సాయంత్రం వీరవాసరంలో సుడిగాలి కారణంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పరామర్శించారు. నవుడూరు రోడ్‌లోని రైస్ మిల్లు ప్రాంతాన్ని, పాలకొల్లు రోడ్డులోని కక్క–ముక్క హోటల్‌ను, మిగిలిన పరిసరాల్ని పరిశీలించారు. బాధితులను ఆదుకుంటామని, వెంటనే నష్టపరిహారానికి సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలని తహసీల్దార్ ఎం.సుందరరాజును ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా అడ్డుగా ఉన్న చెట్లను, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఆదేశించారు. వీలైనంత తొందరగా విద్యుత్‌ను పునరిద్ధరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. బాధితులకు సంబంధించి వెంటనే సహాయక చర్యలను చేపట్టాలని సూచించారు.

రైల్వే స్టేషన్లలో హెల్ప్‌లైన్ ఏర్పాటు

ఏలూరు(టూటౌన్): తుపాను కారణంగా దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేసినట్లు ఏలూరు స్టేషన్ మేనేజర్ ఎస్‌వి రమేష్ తెలిపారు. ప్రయాణికులకు రైల్వే సమాచారం ఎప్పటికప్పుడు అందించేందుకు ఉన్నతాధికారులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో మొత్తం 13 హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశారన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఏలూరు, భీమవరం స్టేషన్లలో హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏలూరు హెల్ప్ లైన్ నెంబరు 08812-232267, భీమవరం టౌన్ హెల్ప్‌లైన్ నెంబరు 08816-230098, 78159 09402లో సంప్రదించాలన్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

భీమవరం (ప్రకాశంచౌక్): తుపాను తీరం దాటి బలహీన పడుతున్న సందర్భంలో అధిక వర్షాలు కురిసే పరిస్థితి ఉందని దీని దృష్టిలో పెట్టుకుని బుధవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు ఖచ్చితంగా ఉత్తర్వులను పాటించాలన్నారు.

పునరావాస కేంద్రాలకు 5,215 మంది తరలింపు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని 26 తుపాను ప్రభావిత గ్రామాల్లో 28 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 5,215 మందిని తరలించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల నుంచి పశువులను నరసాపురం అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌కు, మొగల్తూరు బర్రెల దొడ్డికి తరలించామన్నారు. పది జనరేటర్లను, 21 జెసీబీలను సిద్ధంగా ఉంచామన్నారు. వరి చేలలో నీటిని తొలగించేందుకు ఎన్ఆర్జీఎస్ కూలీల ద్వారా గాడులు తవ్వించామన్నారు. 20 టీంలను పారిశుద్ధ్య పని కోసం కేటాయించామన్నారు.

ఏజెన్సీలో గాలి, వాన బీభత్సం



బుట్టాయగూడెం: తెల్లంవారిగూడెంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

బుట్టాయగూడెం: మిచాంగ్ తుపాను ప్రభావంతో ఏజెన్సీలో భారీ వర్షాలతో పాటు మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో మండలంలోని లక్ష్మీపురంలో పలు చోట్ల రేకుల షెడ్‌లపై ఉన్న రేకులు చెల్లాచెదురుగా పడిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం నేలకొరిగింది. కృష్ణాపురం, పైదావారిగూడెం గ్రామ సమీపంలో కూడా విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. జోరున వర్షం కురుస్తున్నా విద్యుత్ పునరుద్ధరణకు సిబ్బంది, అధికారులు చర్యలు చేపట్టారు.

పక్కాగా ముందస్తు సహాయక చర్యలు

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం (ప్రకాశంచౌక్): తుపాను సహాయక చర్యల్లో భాగంగా జిల్లాలో అన్ని ముందస్తు చర్యలు చేపట్టి పక్కాగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాలో మంగళవారం తెల్లవారుజాము నుంచి అధిక వర్షాలు నమోదవుతున్నాయని.. వర్షం రాక ముందు రైతులను అప్రమత్తం చేసి 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యం దగ్గరలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించామని చెప్పారు. మరి కొంత రైతులు స్వతహాగా బరకాలతో కప్పి భద్రపరచుకున్నారని తెలిపారు. వర్షం తగ్గిన వెంటనే ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రెయిన్లలో పూడిక తొలగింపు చేపడతారన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని.. మరికొంతమందిని పునరావాస కేంద్రాలకు తరలించామని చెప్పారు.

సవరణలకు పక్కా రికార్డులు నిర్వహించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావడంతో పాటు రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడమే లక్ష్యంగా ఓటర్ల జాబితా సవరణ చేపట్టామని ఓటర్ల జాబితా సవరణ రోల్ అబ్జర్వర్ ఎస్.యువరాజ్ తెలిపారు. మంగళవారం భీమవరంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ఓటర్ల జాబితా సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్ఓలు, ఎఈఆర్‌ఓలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పుల సవరణలకు సంబంధించి ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా పక్కాగా రికార్డులు నిర్వహించాలన్నారు. రోల్ అబ్జర్వర్‌గా రాజకీయ పార్టీల ప్రతినిధులతో, ఈఆర్ఓ, ఎఈఆర్‌ఓలతో మొదటి సమావేశం నిర్వహిస్తున్నానని వచ్చే సమావేశాలలో క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలిస్తానన్నారు. వచ్చిన క్లెయిమ్స్ పెండింగ్‌లో పెట్టుకోకుండా ఎప్పటికప్పుడు ప్రొసీజర్ ప్రకారం క్లియర్ చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఓటర్ల జాబితా సవరణను కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు శ్రద్ధగా చేస్తున్నారని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఎస్.యువరాజు

క్లుప్తంగా

అట్రాసిటీ కేసు నమోదు

యలమంచిలి: ప్రేమిస్తున్నానని మోసం చేసిన నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కాకి శివన్నారాయణ మంగళవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడవిపాలెం గ్రామానికి చెందిన యువతిని దొడ్డిపట్ల గ్రామానికి చెందిన వలవల సత్యసాయి ప్రేమిస్తున్నానని చెప్పి మోసం చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు ఆమెను పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తెలంగాణలో జనసేన కంటే బర్రెలక్కే నయం



సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలంగాణ ఎన్నికల్లో బర్రెలక్కకు వచ్చిన ఓట్లు కూడా జనసేన అభ్యర్థులకు రాలేదని డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు ఎద్దేవా చేశారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ, జనసేన ఒకే సమయంలో పార్టీలు స్థాపించగా, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2014 ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకుడిగా, 2019 ఎన్నికల్లో పూర్తి మెజారిటీతో గెలిచి రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారని, ఎన్నికల ప్రణాళిక ద్వారా 99 శాతం ఇచ్చిన హామీలు నెరవేర్చారన్నారు. 2019 ఎన్నికల్లో పవన్ కల్యాణ్ గాజువాక, భీమవరంలలో పోటీ చేసి రెండు చోట్ల ఓడిపోయారని చెప్పారు. రాష్ట్రంలో పవన్, చంద్రబాబుతో జత కట్టడంతో జనసేన కార్యకర్తలు నిరాశలో ఉన్నారన్నారు. పవన్ ఏపీలో టీడీపీతో, తెలంగాణాలో బీజేపీతో జతకట్టడం చూస్తుంటే ప్రజలు అయోమయంలో పడ్డారని తెలిపారు. నాయకులు వి.అమల్ దాస్, టి.స్వరూపారాణి, వి.రాంబాబు పాల్గొన్నారు.

అతలాకుతలం



ఏలూరు రూరల్: చొదిమెళ్లలో అధికారుల సహకారంతో ధాన్యంపై బరకాలు కప్పి, మిల్లులకు తరలిస్తున్న రైతులు

మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా ఉమ్మడి జిల్లా అతలాకుతలమైంది. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన జోరువానలకు పలు ప్రాంతాలు, రోడ్లు జలమయం కాగా, పలుచోట్ల పంటలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. నీటి మునిగిన పంటలను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నం కాగా, వారికి సహాయంగా అధికారులు ఉపాధి హామీలో సిబ్బందిని పంపించి పంట సంరక్షణకు చర్యలు తీసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జంగారెడ్డిగూడెం: పంగిడిగూడెంలో కల్లంలో ఉన్న ధ్యాన్యం రాశులను కాపాడుకుంటున్న రైతులు



పెనుగొండ: ఇలపర్రులో ఓ రైతు చేలో ధాన్యం రాశిని తడవకుండా వర్షం నీటిని మళ్లిస్తున్న ఉపాధి కూలీలు



భీమడోలు: భీమడోలులో రోడ్డు డివైడర్‌పై ఉంచిన ధాన్యం రాశులపై బరకాలతో కప్పి ఉంచిన దృశ్యం



దెందులూరు: కొవ్వలిలో ధాన్యం రాశి వద్ద నిల్వ ఉన్న వర్షం నీటిని తొలగిస్తున్న రైతు



కొయ్యలగూడెం: రేపల్లెవాడలో భారీ వర్షాలకు నీట మునిగిన వర్జీనియా పొగాకు తోట



భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం హెచ్‌బీ కాలనీలో నీట మునిగిన రోడ్డు



దెందులూరు: ముంపునకు గురైన పెరుగ్గూడెం-ద్వారకాతిరుమల రహదారి



బుట్టాయగూడెం: జీలుగుమిల్లి సమీపంలో రోడ్డుపై పొంగుతున్న వాగు



ఏలూరు టౌన్: చెరువును తలపిస్తున్న పవరుపేట స్టేషన్ సెంటర్

22 కిలోల గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్టు

కాళ్ల: పాడేరు నుంచి గంజాయిని తీసుకువచ్చి ఇక్కడ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పీఎస్ వీరభద్రరావు మంగళవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు నిఘా ఉంచామన్నారు. ఈ క్రమంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా మల్కిపురం మండలం దిండి గ్రామానికి చెందిన నలుగురు యువకులు పాడేరు నుంచి రహస్యంగా గంజాయిని తీసుకువచ్చి కాళ్ల డంపింగ్ యార్డ్‌లో దాచిపెట్టారని, మంగళవారం దీనిని తీసుకువెళ్లడానికి యువకులు రాగా, మంగళవారం స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో కలిసి చాకచక్యంగా పట్టుకుని అరెస్టు చేశామన్నారు. గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి యువతకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఎస్పీ రవి ప్రకాష్ ఆదేశాల మేరకు ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ, కాళ్ల పోలీసులు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో కలిసి కాళ్ల డంపింగ్ యార్డ్ వద్ద తహసీల్దార్ కృష్ణారావు సమక్షంలో వారిని అరెస్ట్ చేసి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.22 వేలు ఉంటుందని, నిందితులను భీమవరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని ఎస్సై తెలిపారు.

తుపానులోనూ ఆగని పింఛన్ల పంపిణీ

తణుకు టౌన్: తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నా లెక్కచేయకుండా ధైర్యంగా దూర ప్రాంతాలకు వెళ్లి లబ్ధిదారులకు పింఛను సొమ్ములు అందిస్తూ వలంటీర్లు తమ సేవా దృక్పథాన్ని చాటారు. తణుకు రూరల్ మండలం తేతలి గ్రామానికి చెందిన చేబ్రోలు అనంతలక్ష్మి దివ్యాంగ పింఛను లబ్ధిదారు. అయితే ఆమె గర్భిణి కావడంతో ప్రసవం కోసం పుట్టిల్లు ద్వారకాతిరుమలలోని తన తల్లి దండ్రుల ఇంటికి వెళ్లింది. విషయం తెలుసుకున్న వలంటీర్ మానూరి భాగ్య జ్యోతి మంగళవారం తేతలి నుంచి తన సొంత ఖర్చులతో ద్వారకాతిరుమల వెళ్లి అనంత లక్ష్మికి పింఛను సొమ్ము అందజేసింది. వలంటీర్‌ను పలువురు అభినందించారు.



ద్వారకాతిరుమలలో అనంతలక్ష్మికి పింఛను అందజేస్తున్న భాగ్యజ్యోతి



లక్ష్మీపోలవరం వెళ్లి వృద్ధురాలికి పింఛను అందిస్తున్న వలంటీర్ వెంకటలక్ష్మి

లక్ష్మీపోలవరం వెళ్లి..

పెనుగొండ: జోరు వర్షంలోనూ దూర ప్రాంతానికి వెళ్లి పింఛను అందజేసిన వలంటీర్ వెంకటలక్ష్మిని పలువురు అభినందించారు. వివరాల్లోకి వెళితే.. ఇలపర్రుకు చెందిన వడ్డీ లక్ష్మి అనారోగ్యంతో అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం లక్ష్మీ పోలవరంలో కుమార్తె వద్ద ఉంటోంది. మంగళవారం వలంటీర్ వెంకటలక్ష్మి ఆమెకు పింఛను ఇచ్చేందుకు ఇంటికి వెళ్లగా లక్ష్మీ పోలవరంలో కుమార్తె వద్ద ఉంటోందని తెలుసుకుంది. తుపాను ఉన్నా లెక్కచేయక సొంత ఖర్చులతో లక్ష్మీపోలవరం వెళ్లి వడ్డీ లక్ష్మికి వలంటీర్ వృద్ధాప్య పింఛను సొమ్ము అందించింది. ఈ సందర్భంగా వలంటీర్ వెంకటలక్ష్మి సేవలను మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు అభినందించారు.

శ్రీవారి క్షేత్రంపై మిచాంగ్ ఎఫెక్ట్



శ్రీవారి దర్శనానంతరం బయటకు వెలుతున్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంపై మిచాంగ్ తుపాను ఎఫెక్ట్ పడింది. ఎడతెరిపిలేని వర్షం కారణంగా అతి స్వల్పసంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేశారు. ప్రతి మంగళవారం క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంటుంది. అయితే ఈ వారం మరీ స్వల్ప సంఖ్యలో భక్తుల రద్దీ ఉంది. అనివేటి మండపం, పార్కింగ్ ప్రదేశాల్లో భక్తులు నామమాత్రంగా కనిపించారు. దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తుల లేమితో వెలవెలబోయాయి.

తుపాను ప్రభావంతో ఆక్వా రైతుల్లో గుబులు

గణపవరం: మిచాంగ్ తుపాను ఆక్వా రైతుల్లో గుబులు రేపుతోంది. తుపాను ప్రభావంతో రెండు రోజులుగా వాతావరణం పూర్తిగా చల్లబడి, ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో చేపలు, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ సమస్య తలెత్తింది. దీంతో రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటూ నిరంతరం చెరువుల వద్దే పడిగాపులు కాస్తున్నారు. సోమవారం ఉదయం ప్రారంభమైన వర్షం మంగళవారం రాత్రి వరకూ కురుస్తూనే ఉంది. మధ్యలో కాస్త తెరిపిచ్చినా వెంటనే మళ్లీ భారీ, నుంచి అతి భారీ వర్షాలు కురియడంతో చేపల చెరువులలో ఆక్సిజన్ కొరత ఏర్పడి చేపలు, రొయ్యలకు ప్రాణాంతకంగా మారింది. దీంతో చెరువుల్లో సున్నం, ఇతర రసాయనాలు కలుపుతూ ఆక్సిజన్‌శాతం పెంచడానికి రైతులు ప్రయత్నిస్తున్నారు. చెరువులలో నిరంతరం ఏరియేటర్లు తిప్పుతూ, ఇంజిన్లు వేసి చెరువులలో నీరు రీసైక్లింగ్ చేస్తున్నారు. అయినా ఆక్సిజన్ సమస్య తొలగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంత కాలం వైరస్ వ్యాధులతో, సరైన ధరలేక, సతమతమైన ఆక్వాసాగు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న దశలో అకస్మాత్తుగా వచ్చిపడిన తుపాను గండం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ఏడాది ఆక్వా సాగు రైతులను దారుణంగా దెబ్బతీసింది. నాణ్యత లేని సీడ్, తెగుళ్ల విజృంభణ, రికార్డుస్థాయిలో వర్షాలు, వంటి సమస్యలను కొద్దిమంది రైతులు మాత్రమే అధిగమించి పెట్టుబడులు దక్కించుకుని బయటపడ్డారు. నియోజకవర్గంలో సుమారు 25 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా సాగు చేస్తున్నారు. 10 వేల ఎకరాలలో రొయ్య సాగు జరుగుతోంది.



గణపవరంలోని ఓ ఆక్వా చెరువులో తిప్పుతున్న ఏరియేటర్లు

పంటకాలువలో వృద్ధుడి మృతదేహం

పోడూరు: పోడూరులోని సినిమాహాలు సెంటరు వద్ద చినవాడ పంట కాలువలో మంగళవారం ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఆచంట శివారు గొల్లపల్లివారిచెరువుకు చెందిన సరెళ్ల ధర్మారావు (72)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, వృద్ధుడు ప్రమాదవశాత్తూ కాలువలో జారిపడ్డాడా? లేక మరేదైనా కారణం ఉందా? అనే వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.రామ్‌కుమార్ చెప్పారు.

అనుమానమే పెనుభూతమై..

- భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త
- ఆడమిల్లిలో ఘటన



తానేటి శిరీష మృతదేహం

కామవరపుకోట: ఆడమిల్లి గ్రామంలో భార్యపై అనుమానంతో ఓ భర్త ఆమెను గొడ్డలితో నరికి హత్య చేశాడు. తడికలపూడి ఎస్సై జయబాబు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆడమిల్లి గ్రామానికి చెందిన తానేటి చిన్న ఏసుకు, దెందులూరు మండలం గంగన్నగూడెంకు చెందిన శిరీష (33)తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తుంటారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. వీరిలో ఒకరు అమ్మమ్మ ఇంటి వద్ద, మరో కుమార్తె హాస్టల్లో ఉండి చదువుకుంటున్నారు. ఇదిలా ఉండగా, గత కొంతకాలం నుంచి ఏసు తరచూ భార్యను అనుమానిస్తుండటంతో వారి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో భార్యాభర్తలు ఇద్దరూ సోమవారం పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్నారు. ఏం జరిగిందో తెలియదు గాని రాత్రి ఇంట్లో భార్య నిద్రిస్తున్న సమయంలో ఏసు ఆమె తలపై గొడ్డలితో నరకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మంగళవారం ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్, ఎస్సై జయబాబు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించి శిరీష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై జయబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పరిశీలిస్తున్న సీఐ పి.రాజేష్, ఎస్సై జయబాబు

క్లుప్తంగా

పశువులకు టీకాలు



గొంతువాపు రాకుండా పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ వైద్యసిబ్బంది

పెంటపాడు: పశువ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) డాక్టర్ ఎల్ కే సుధాకర్ పేర్కొన్నారు. గత రెండు రోజుల నుంచి తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. మంగళవారం పెంటపాడులోని పలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. తుపాను తర్వాత పశువులలో సాధారణంగా దొమ్మ, గొంతువాపు వ్యాధులు ప్రబలుతాయన్నారు. వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేసి పశువులను రక్షించుకోవాలన్నారు. ప్రధానంగా ముంపు ప్రాంతాల నుంచి పశువులను రక్షించుకోవాలన్నారు. పశువులలో పాలు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి మహేష్ పాల్గొన్నారు.

తుపాను పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

పెంటపాడు: తుపాను పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రైతు కార్యాచరణసమితి అధ్యక్ష, ఉపాధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజు, నల్లమిల్లి విజయానందరెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం పెంటపాడులో ధాన్యం ఒబ్బిడి చేసుకొంటున్న పలువురు రైతులను కలిశారు. ఈ సందర్భంగా రైతులకు ధైర్యం చెప్పారు. వర్షాలు తగ్గేంత వరకు రైతులు కోతలు చేపట్టవద్దన్నారు. కళ్లాల్లో ధాన్యం రాసులు ఉంటే వాటిని జాగ్రత్త చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధాన్యం అమ్మకాల విషయంలో నిబంధనలు సడలించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



సాయిబాబా విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఆకివీడు : స్థానిక బైపాస్‌రోడ్డులోని వెంకయ్య వయ్యేరు పంట కాలువకు చేర్చి సాయి మందిర పునఃప్రాణప్రతిష్ఠ, సాయిబాబా పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆలయం వద్ద సాయి కోటి నామ లిఖిత మహా యజ్ఞం జరిగింది. గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక లయన్స్ ప్రతినిధి సన్నిధి వెంకన్నబాబు, లక్ష్మీ రాజ్యం దంపతులు విగ్రహ ప్రతిష్ఠ చేశారు.

ప్రత్యేక అలంకరణ ఉమా సోమేశ్వర స్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీకమాసోత్సవాల్లో భాగంగా 22 రోజు మంగళవారం గునుపూడి పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్ధన స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అభిషేకాలు, హోమాలు, దర్శనం టిక్కెట్లు, ప్రసాద విక్రయాల ద్వారా రూ.9,450 ఆదాయం లభించినట్టు ఈఓ డి.కృష్ణంరాజు తెలిపారు. ఏర్పాట్లను ధర్మకర్తల మండలి సభ్యులు కుర్మదాసు సత్యశ్రీనివాస్, నాచుశ్రీవల్లి, లక్కు త్రిమూర్తులు, కోయతాతాజీ, నల్లం రఘుబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, సోమాదుల లీలా ఈశ్వరి, తాణాల రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

విద్యార్థి పవన్‌కు గోల్డ్ మెడల్

భీమవరం: ఇటీవల పెనుగొండ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అంతర్ కళాశాలల బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థి వెంపాడ పవన్ గోల్డ్ మెడల్ సాధించాడని ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన తెలిపారు. 54 కిలోల విభాగంలో సత్తాచాటి యూనివర్శిటీ తరపున చండీగఢ్‌లో జరిగే అంతర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పవన్‌ను పీడీ ధనుంజయ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ లక్ష్మీకాంతం, పి.అరవింద స్వామి, పి.రాజశేఖర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మొగల్తూరు: మిచాంగ్ తుపాను ప్రభావం దృష్ట్యా ఆరోగ్య శాఖ వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డి.మహేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం మొగల్తూరు పీహెచ్‌సిలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాను దృష్ట్యా నియోజకవర్గంలో 14 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. తూర్పుతాళ్లలో 10, ఎల్‌బీ చర్లలో 2, మొగల్తూరు పీహెచ్‌సీలో 2 శిబిరాలు ఏర్పాటు చేశామని 55 మంది పారావైద్య సిబ్బందిని ఆరుగురు వైద్యాధికారులను అందుబాటులో ఉంచామన్నారు. 18 మంది గర్భిణులను వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు.

ఎడతెరిపి లేని వర్షంతో రోడ్లన్నీ జలమయం

- పొంగిపొర్లిన డ్రెయిన్లు
- మరో వక్క రైతుల అగచాట్లు
- గూడెంలో 83, పెంటపాడులో 88.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు



తాడేపల్లిగూడెం రూరల్: పట్టణం మూడవ వార్డు హనోక్ చర్చి ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



తాడేపల్లిగూడెం రూరల్: మసీదు సెంటర్ శేషమహల్ వెనుక ప్రాంతంలో ఇలా



తాడేపల్లిగూడెం: పట్టణంలో ఈదురుగాలుల దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో గత రెండ్రోజులుగా తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. సోమవారంతో పోల్చుకుంటే మంగళవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. ప్రధానంగా మసీదు సెంటర్, కడకట్ల, హౌసింగ్ బోర్డు, మూడవ వార్డు తదితర లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. ప్రధాన డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. క్షణం కూడా విరామం లేకుండా ఏక బిగిన వర్షం కురవడంతో రోడ్లపై జనజీవనం స్తంభించింది. పలువురు ప్రజలు ఇళ్ళకే పరిమితమయ్యారు. అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు బయటకు వచ్చేందుకు ఆసక్తి కనబర్చలేదు. వర్షం దాటికి రోడ్లన్నీ జన సంచారం లేక వెలవెలబోయాయి. ఇప్పటికే ఖరీఫ్ కోతలు పూర్తి చేసి, ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టిన రైతులు వాటిని రక్షించుకునే పనిలో కుండపోత వర్షంలోనూ నిమగ్నమైన దృశ్యాలు కనిపించాయి. ఆరుగాలం శ్రమించిన పండించిన పంట ఇలా ప్రకృతి వైపరీత్యాల బారిన పడటంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో నాలుగైదు రోజులు వాతావరణం అనుకూ



తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తున్న దృశ్యం

లిస్తే బాగుండేదనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేశారు. పలు చోట్ల అధికారులు ధాన్యాన్ని మిల్లులకు తరలించే చర్యలు చేపట్టారు. ఇదిలా ఉంటే, సోమవారం సాయంత్రం 5 నుంచి మంగళవారం మధ్యాహ్నం 1 గంట వరకు 83 మిల్లీ మీటర్ల వర్ష



తాడేపల్లిగూడెం: మున్సిపల్ కమిషనర్ శామ్యూల్‌తో కలిసి లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న కొట్టు విశాల్

పాతం నమోదైందని ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ ఎస్. శివశంకర్ తెలిపారు. పెంటపాడు మండలంలో 88.2 మిల్లీ మీటర్లుగా వర్షపాతం నమోదైంది.

గూడెంలో భారీ వర్షం

తాడేపల్లిగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను కారణంగా గూడెంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఆగకుండా ఏకదాటిగా వర్షం పడుతూనే ఉంది. దీనికి తోడు ఈదురుగాలులు తోడు కావడంతో వానా, గాలులలతో ప్రజలకు బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు గూడెంలో 130.2మి.మీలు, , పెంటపాడు మండలంలో 136.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. గూడెం మండలానికి ఎర్రకాల్వ ప్రమాదం కూడా పొంచి ఉన్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. గూడెం మండలంలో మెట్ట ప్రాంతంలో ముందుగానే మాసూళ్లు పూర్తయ్యాయి. డెల్టా ప్రాంతంలో కూడా సార్వా కోతలను త్వరితగతిన పూర్తి చేయడం, ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించారు. ప్రభుత్వం ధాన్యాన్ని ఏ మిల్లుకైనా తోలుకోవచ్చనే వెసులుబాటు ఇవ్వడం కూడా రైతులకు వరంగా మారింది. అధిక వానలకు నీరు నిలిచిపోయే ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్, వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్, వైసిపి శ్రేణులు పర్యటించారు. నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో డ్రెయిన్లలో చెత్తను తీయించారు. ప్రొక్లెయిన్ సాయంతో వాననీరు సక్రమంగా వెళ్లే ఏర్పాట్లు చేశారు. ప్రజలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపడుతున్నారు.

ఘనంగా ఆర్యవైశ్య కార్తీక వనసమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీక మాసం సందర్భంగా ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం 72వ కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఆర్యవైశ్యమహాసభ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, పట్టణ ప్రముఖులను ఘనంగా సన్మానించారు. కార్తీక మాసం సందర్భంగా శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు, చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ , ఆలయ కార్యదర్శి కురిసేటి శ్యామ్, నున్న చైతన్య, పలివెల ఏకాంబరేశ్వరరావు, సమయమంతుల హేమసుం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కొట్టు విశాల్, తదితరులు

దర్, నున్న సుందరం, నున్న ఆనంద్, పేరూరి కాశయ్య, వబిలిశెట్టి నటరాజు, గమిని సుబ్బారావు, కె.హరినాథ్, ఆలపాటి అచ్యుత లక్ష్మి, పి.స్వర్ణ, శ్రీ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆదుకొనేందుకు ప్రభుత్వం సిద్ధం

పెంటపాడు: తుపాను ప్రభావంతో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు అధైర్యపడవద్దని జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ రైతులకు భరోసా ఇచ్చారు. ఈ విషయంపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణకు ఇక్కడి పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. మంగళవారం ఆయన గూడెం ఏడీఏ మురళీకృష్ణ, పెంటపాడు తహసిల్దార్ జీవీ శేషగిరిరావు, వ్యవసాయాధికారి కె. పార్థసారధితో కలిసి పలు గ్రామాల్లో పర్యటించారు. తుపాను వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా దగ్గరుండి వారి ధాన్యం పట్టబడి పట్టించి మిల్లులకు తరలించారు. ఈ విషయంపై పలువురు రైతులు హర్షం తెలిపారు. మండల తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఏడీఏ మురళీకృష్ణ, ఏవో సారధిలు మాట్లాడుతూ వ్యవసాయశాఖ, రెవిన్యూశాఖ ఆధ్వర్యంలో తుపాను ప్రభావం దృష్ట్యా పలు గ్రామాలు సందర్శించి సూచనలు చేశామన్నారు. మరో మూడు రోజులు ధాన్యం మాసూళ్లు చేయకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలకు రైతులు దొరకుండా పంటను రక్షించుకోవాలన్నారు. ధాన్యం రాసులపై బరకాలు వేయించారు. ధాన్యం ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ పర్యటనలో ఆర్‌ఐ కనకదుర్గ, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

నీరు బయటకు పోయే మార్గాలు ఏర్పాటు చేసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: నారుమడులలో ఉన్న నీరు బయటకు పోయే మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని ఏడీఏ పి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని చినతాడేపల్లి, నీలాద్రిపురం, కడియద్ద, పట్టింపాలెం, కొమ్ముగూడెం గ్రామాల్లో ఏవో ఆర్‌ఎస్.ప్రసాద్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ మినుము పంట చేతికొచ్చిన దశలో వర్షాలు కురవడంతో పంట నీట మునిగిందని, పంట నష్టం అధికంగానే ఉంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ 285 హెక్టార్లలో మినుము పంట నీట మునిగిందన్నారు. మరో 48 గంటలు నీటిలోనే ఉంటే పంట దెబ్బతినే అవకాశం ఉందన్నారు. నీరు బయటకు పోయేలా చూడాలన్నారు. ధాన్యం రాశులపై బరకాలు కప్పిన ప్రాంతాల్లో నీరు ఉంటే



నీట మునిగిన మినుము పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మురళీకృష్ణ, చిత్రంలో ఏవో ప్రసాద్

వాటిని బయటకు తీయడానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారన్నారు. రాబోయే రెండ్రోజులు వర్షపాతం ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి వెంట ఆర్బీకే ఇన్‌చార్జ్ శివశేఖర్, వంశీ, ధర్మరాజు, రైతులు ఉన్నారు.

తుపాను పరిస్థితులను ఎదుర్కొంటాం

నరసాపురం: జిల్లాలో తుపాను ప్రభావ పరిస్థితులు సమర్థవంతంగా ఎదుర్కొవడానికి అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుందని జిల్లా ప్రత్యేక అధికారి, మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు చెప్పారు. మంగళవారం నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. తుపాను తరువాత పరిస్థితి యధాస్థితికి వచ్చే వరకూ బాధితులు పునరావాస కేంద్రాల్లో ఉండాలని కోరారు. ముఖ్యంగా నరసాపురం, ఆచంట, మొగల్తూరు మండలాల్లో ఎక్కువ ఎఫెక్ట్ ఉందన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పంట, ఇతర నష్టాలు అంచనా వేస్తామని చెప్పారు. ఆయన వెంట నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్, మండల ప్రత్యేక అధికారి వి.విజయలక్ష్మి, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌బీఎస్ ప్రసాద్ ఉన్నారు.

పోడురులో...

పోడూరు: మండలంలో జగన్నాధపురం గ్రామంలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్యేక అధికారి, మత్స్య శాఖ కమిషనరు కె.కన్నబాబు మంగళ



వంట ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు, ఆర్డీవో ఎంఏ అంబరీష్

వారం పర్యటించారు. మిచాంగ్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న వరిచేలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ ఎంఏఅంబరీష్, ప్రత్యేక అధికారి డి.సావిత్రి, తహసీల్దారు ఆర్‌వీ కృష్ణారావు, ఎంపీడీఓ డి.సుహాసిని ఉన్నారు.

తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తణుకు: తుపాను బీభత్సం వల్ల నష్టపోయిన అన్ని పంటల రైతులతో పాటు లోతట్టు ప్రజలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ప్రతాప్ కోరారు. మంగళవారం తణుకు తహసీల్దార్ ప్రసాద్‌కు సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన అన్ని పంటల రైతులను, ప్రజలను ఆదుకోవాలన్నారు. వరి కోతలు ఇప్పటికి 50 శాతం పూర్తి చేసి మాసూళ్ల పనిలో రైతులు ఉన్నారని మరో 50 శాతం చేలల్లో ఉన్న పంట తడిచిపోయిందన్నారు. రైతులకు అధికారులు వెంటనే బరకాలు, సంచులు అందజేయాలని కోరారు. తడిచిన ధాన్యాన్ని నిబంధనలు



తణుకు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సడలించి మద్దతు ధరకే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



పట్టణ శివారులో ఒరిగిన విద్యుత్ స్తంభం, రిపేర్లు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): తుపాను కారణంగా పట్టణంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయలు ఏర్పాడ్డాయి. ఈదురుగాలుల కారణంగా అనేక ప్రాంతాల్లో చెట్లు కొమ్మలు విరిగి విద్యుత్ స్తంభాలపై పడడంతో వైర్లు తెగిపోయాయి. జోరున వర్షం కురుస్తున్న విద్యుత్ పునరుద్ధరణకు సిబ్బంది అధికారులు కృషి చేస్తున్నారు.

ముంపు చేలను పరిశీలించిన కలెక్టర్

కాళ్ల: తుఫాను ప్రభావంతో నీట మునిగిన వరి పంట పొలాలను జిల్లా కలెక్టర్ ప్రశాంతి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. కాళ్ల మండలం సీసలి గ్రామంలో నేలకొరిగిన వరిచేలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. మండలంలో ప్రధాన డ్రెయిన్ మొగదిండి తూడు, గుర్రపు డెక్కతో పూడుకుపోవడంతో ముంపు సమస్య తలెత్తిందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. మండలంలో 3878 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇందులో 1,100 ఈదురుగాలులకు పడిపోయిందని, మరో 1200 ఎకరాల పంట నీటమునిగినట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. బుధ, గురువారాల్లో ఎగువ ప్రాంతాల వర్షపునీటి వల్ల పంటనష్టం మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. ముంపు నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జేసి ఎస్ రామసుందరరెడ్డి, ప్రత్యేక అధికారి కన్నబాబు, ఆర్డీఓ శ్రీనివాసులురాజు, వ్యవసాయశాఖ జేడీ జెడ్ వెంకటేశ్వ



సీసలిలో వరి పొలాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రరావు, ఏడీఏ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణారావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రభాకరావు, ఏఓ జయవాసుకి, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రైతులకు అండగా సీఎం జగన్

పెనుగొండ: అకాల వర్షంతో ఏ ఒక్క రైతు నష్టపోకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రక్షణ చర్యలు చేపట్టారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. మంగళవారం ఆచంట నియోజకవర్గంలో నీట మునిగిన పలు గ్రామాల్లోని వరిచేలను పరిశీలించారు. ముందస్తు సమాచారంతో అధికారులను అప్రమత్తం చేసి నష్ట నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు, ధాన్యం విక్రయాల్లో నిబంధనలు సడలించి రైతులకు అండగా నిలిచారన్నారు. ప్రతీ జిల్లాకు తుపానుకు గాను ప్రత్యేకాధికారులను నియమించడంతో పాటు, జిల్లా కలెక్టర్లును అప్రమత్తం చేశారన్నారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, వారికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేశారన్నారు. పంట నష్ట వివరాలు ఎప్పటికపుడు పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరిగిందన్నారు. సుమారు 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించారు.ధాన్యాన్ని రైతులు వర్షం అనంతరం సత్వరం తరలించడానికి ఏర్పాటు చేసుకోవాలన్నారు.

అప్రమత్తతే ఔషధం



రావిపాడు గ్రామంలో వ్యాధులు, శుభ్రతపై వృద్ధునికి అవగాహన కల్పిస్తున్న ముదునూరు పీహెచ్‌సీ డాక్టర్ ఎస్వీ రమణ



పరిమెళ్ల ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ దాసరి హైమావతి(ఫైల్)

- సీజనల్ వ్యాధులతో బెంబేలెత్తిస్తున్న వైరల్ జ్వరాలు
- జ్వరమే కదా అని వదిలేస్తే ప్రాణాంతకమే
- వ్యాధులతో జాగ్రత్త అంటున్న వైద్యాధికారులు

పెంటపాడు: ప్రతికూల వాతావరణంలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాకాలం ముగిసినా సీజనల్ వ్యాధుల ప్రభావం తగ్గడం లేదు. ప్రధానంగా దోమల వల్ల వ్యాధులు అధికమౌతున్నాయి. దీంతో జ్వరాలు అధికంగా నమోదవుతున్నాయి. ఏ సీజన్‌లోనైనా పారిశుద్ధ్య చర్యలు పటిష్టంగా పాటించమే ఈ సమస్యకు మొదటి పరిష్కారమని వైద్యులు చెబుతున్నారు. వాతావరణ ప్రభావం వల్ల వర్షాలు, మరో పక్క చలిగాలుల ప్రభావం ఉంటోంది. దీంతో ప్రజలు మారుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల రోగగ్రస్తులు అవుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, ప్రేవేటు ఆస్పత్రులు కూడా రోగులతో కిటకిట లాడుతున్నాయి. పెంటపాడు మండలంలో పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీలు ఉన్నాయి. గతంలో కంటే ఓపీ సేవలు భారీగా పెరిగినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధుల అవగాహన కోసం విస్తృత ప్రచారం చేస్తున్నారు. పలు గ్రామాల్లో వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, వలంటీర్లు, ఆశల సాయంతో ఫీవర్ సర్వే చేస్తున్నారు. దీంతో పాటు, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పేరుతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

రోగాల సీజన్ ప్రారంభంలో ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లలో నీటినిల్వ లేకుండా చూసుకోవాలి. తినే ఆహారం, తాగేనీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఆహారం తీసుకొనేముందు, మల విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుగుకోవాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి. మంచాలకు, ఇంటి గుమ్మాలకు దోమలమెస్‌లు వేసుకోవాలి. ఇంట్లో చిన్నారులు ఉంటే వారి శరీరం పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి.

వేగంగా వైద్యసేవలు



జలుబు, దగ్గు, జ్వరం వచ్చే రోగాలకు వేగంగా వైద్య సేవలు అందిస్తున్నాం. ఈ లక్షణాలతో వచ్చే ప్రతి వారికి రక్తపూతలు సేకరిస్తున్నాం. అవసరమైతే సిలైన్ పెట్టి రెండు మూడు రోజులు ఆస్పత్రిలో ఉంచి వైద్యం చేస్తున్నాం. రోగాల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాల శుభ్రత ఉంచుకోవాలని సూచిస్తున్నాం.

– డాక్టర్ ఎస్వీ రమణ, ముదునూరు వైద్యాధికారి

రేపు తణుకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తణుకు టౌన్: తణుకు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఈనెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తణుకు మండల పరిషత్ కార్యాయంలో జరిగే ఈసమావేశం ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

తడిసిన ధాన్యం కొనుగోలు

పాలకొల్లు అర్బన్: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు రైతులకు ధైర్యం చెప్పారు. పాలకొల్లు మండలం బల్లిపాడు, తిల్లపూడి గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించి పలువురు రైతులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలకు రైతుల పంటచేలల్లో వర్షం నీరు నిలిచిపోయింది. పంట చేలు నేలనంటాయి. పంటచేలపై వర్షం నీరు నిలిచిపోవడాన్ని గుడాల గోపి స్వయంగా పరిశీలించారు. తడిసిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం మంజూరు విషయంలోనూ, అలాగే ఇన్సూరెన్స్ విషయంలోనూ రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవింద రాజుల నాయుడు, దెందులూరు పార్టీ పరిశీలకుడు యడ్ల తాతాజీ పాల్గొన్నారు.

11న చింతపల్లిలో క్రిస్మస్ వేడుకలు

పెంటపాడు: మండలంలోని చింతపల్లి గ్రామంలో ఈనెల 11న అంబేద్కర్ గ్రౌండ్‌లో మోగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు చింతపల్లి క్రిష్టియన్ యూత్ సంఘ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సువార్తికులు డబ్లూసీఎం కిరణ్ పాల్ (గుడివాడ), సువార్త గాయకులు చిన్ని సవరపు (గౌరీపట్నం)లు హాజరవుతారన్నారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించబోయే ఈ కార్యక్రమాన్ని పరిసర గ్రామాల క్రైస్తవ సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.